సంగారెడ్డి మెదక్

మంగళవారం 06 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:08



## గంగాయిపల్లిచండి బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

- రూ.7 కోట్లతో మండలంలో ఏడు లింకు రోడ్ల అభివృద్ధి

02




# బోర్డులు ఉన్నా..

# గ్రామాల పేర్లు కనిపించవు !

**కల్హేర్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:**

కల్హేర్ నుంచి నారాయణఖేడ్ వెళ్లే ప్రధాన రహదారిపై పలు గ్రామాల సూచిక బోర్డులు చెట్ల కొమ్మల చాటున కనిపించకుండా పోయాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు గ్రామాల పేర్లను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సూచిక బోర్డులపై కమ్ముకున్న చెట్ల కొమ్మలను తొలగించకపోవడంతో సమస్య కొనసాగుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్అండ్బీ అధికారులు స్పందించి బోర్డులకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించి, ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# రేపు గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

## అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి

### -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ (ప్రజా జ్యోతి)**

దేశంలోనే తొలిసారి.. జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు -రామాయంపేటసిద్దిపేట మధ్య చీఎ-765ఉ+ వెంట భారీ ప్లాంటేషన్ కార్యక్రమన్నీ ఈ నెల 6న ప్రారంభించనున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, అధికారుల సమన్వయం తో గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన విజయవంతం పై అధికారులతో సమావేశం నిర్వహించారు.

వివరాలు 2లో

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

## - ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

వివరాలు 2లో



# రేపు గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మొదటిపేజీ తరువాయి




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావు లు ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారనీ, పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నారని తెలిపారు.జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు.జాతీయ రహదారి వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని,పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతోభారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి  కార్యక్రమాన్ని గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.×ఙూజ లో నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభం మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుంటారనీ,2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు.మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరి, 3.30 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారనీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ,ట్రాఫిక్ ,లాంటి పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం ఐ డి వో సి లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను. అదనపు కలెక్టర్ అంబదాస్  రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ,డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అటవీ అధికారి జో జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమా భార్గవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

మొదటిపేజీ తరువాయి



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల  సమస్యలను స్వయంగా ఆలకించిన  కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..  ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.  ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌కు 53, సంగారెడ్డి డివిజన్‌కు 22 , నారాయణఖేడ్ డివిజన్‌కు 5 , జహీరాబాద్ డివిజన్‌కు 1 వినతి అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు  పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గంగాయిపల్లిచండి బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

**శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 05:**

శివ్వంపేట మండలంలో రహదారి సౌకర్యాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలోని గంగాయిపల్లి నుంచి తండా మీదుగా చండి గ్రామం వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను సర్పంచ్ రావెల్లి సాయిలుతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని మారుమూల గ్రామాలు, తండాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రూ.7 కోట్ల వ్యయంతో ఏడు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.రోడ్లు అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కోసం ఇప్పటికే మంజూరైన నిధుల్లో సుమారు రూ.148 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే ఆ నిధులను విడుదల చేసి,నిలిచిపోయిన రహదారి పనులను పూర్తి చేయాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

## 15 మంది సభ్యులు ఎన్నిక 688 మందిలో 295 మంది ఓటు హక్కు వినియోగం

## 42.88 శాతం పోలింగ్ నమోదు



మెదక్ (ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి, మెదక్ ఆర్డీవో డా. కె. రమాదేవి తెలిపారు.మెదక్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో మొత్తం 688 మంది ఓటర్లకు గాను 295 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నట్లు తెలిపారు. దీంతో 42.88 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.పోలైన ఓట్లలో 22 ఓట్లు చెల్లని ఓట్లుగా



గుర్తించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో తుది బరిలో ఉన్న అభ్యర్థులలో 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను సంబంధిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంతంగా,క్రమబద్ధంగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బంది మరియు ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



---

# కరెంట్ కోతలతో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి

## - రైతులను ఆదుకునేందుకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

## తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ డిమాండ్



శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 05:

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు విద్యుత్ కోతలు తీవ్రం కావడంతో మెదక్ జిల్లాలో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటోందని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శివ్వంపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ,,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మెదక్ జిల్లాలో వరి సాగు అధికంగా ఉంటుందని,ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటలకు సాగునీరు అందించేందుకు విద్యుత్‌పై రైతులు ఆధారపడుతున్నారని తెలిపారు.అయితే ఈ నెలలో విద్యుత్ కోతలు తీవ్రంగా పెరగడంతో రోజుకు మూడు, నాలుగు సార్లు సరఫరా నిలిచిపోతోందని అన్నారు. దీంతో మోటార్లు సక్రమంగా పనిచేయక పంటలకు నీరందక అక్కడక్కడా వరి పంటలు ఎండిపోవడం ప్రారంభమైందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్లు, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వ్యవసాయానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యుత్ కోతలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించకపోతే రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు,ఆందోళనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని మైసయ్య యాదవ్ స్పష్టం చేశారు. రైతుల పక్షాన తెలంగాణ రైతు రక్షణ సమితి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి,పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

---

# శివశక్తి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం

### - ముఖ్య అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు

### - రూ.2.50 లక్షలకు లడ్డూ వేలం



శివ్వంపేట ప్రజా జ్యోతి అక్టోబర్ 05:

శివ్వంపేట మండల కేంద్రంలో శివశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఊరేగింపు చేపట్టారు.శివ్వంపేటకు చెందిన కొడకంచి శ్రీనివాస్ గౌడ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు కొడకంచి శివప్రసాద్ గౌడ్ తన మిత్రులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డప్పు చప్పుళ్లు,భాజా భజంత్రీల నడుమ సాగిన ఊరేగింపులో మహిళలు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు.అనంతరం నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో కొడకంచి శ్రీనివాస్ గౌడ్ అల్లుడు సాయి గౌడ్ రూ.2.50 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్కుల మైపాల్ రెడ్డి,కొడకంచి నర్సింలు గౌడ్,కొడకంచి రవీందర్ గౌడ్,షేక్ అలీ,కొడకంచి గణేష్ గౌడ్,గౌతమ్ గౌడ్,సందీప్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో వరి పంటకు తీవ్ర నష్టం

## గంగాయిపల్లిలో పంటను పరిశీలించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

## ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్

**శివ్వంపేట,ప్రజాజ్యోతి అక్టోబర్ 05:**

విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా దెబ్బతిన్న వరి పంటలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సోమవారం పరిశీలించారు. శివ్వంపేట మండలం గంగాయపల్లి గ్రామానికి చెందిన రైతులు గొల్ల బిక్షపతి యాదవ్,పెద్ద దాసరి రవికి చెందిన సుమారు మూడు ఎకరాల్లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించి,రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు చేతికందే సమయంలో విద్యుత్ సమస్య కారణంగా పంటకు అవసరమైన నీరు అందక నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.రైతుల పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.దెబ్బతిన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి,నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కోరారు.విద్యుత్ కోతల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నష్టపరిహారం అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించారు.



# కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం.. సబ్‌స్టేషన్ ముట్టడి

హత్నూర మండల పరిధిలో ని నాస్తిపూర్ సబ్‌స్టేషన్ కేంద్రంలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలపై మంగపూర్ రైతులు సోమవారం నాడు ఆందోళనకు దిగారు.వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ నాస్తిపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు.వ్యవసాయ మోటార్లకు తరచూ లోవోల్టేజీ రావడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.సమాచారం అందుకున్న పోలీసులు సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులు,నాయకులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పారు.దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలలో ప్రజలు పాల్గొన్నారు.



# పి. ఆర్. టీ. యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీబీపేట్ వాసీ

## - 8 ఓట్ల స్వల్ప మెజార్టీతో మహారెడ్డి విఠల్‌రెడ్డి విజయం

**కల్హేర్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:**

పి. ఆర్. టీ. యూ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామానికి చెందిన మహారెడ్డి విఠల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో సమీప ప్రత్యర్థి తులసీరామ్ రాథోడ్‌పై 8 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఆయన విజయం సాధించారు.జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, వారి న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి పి. ఆర్. టీ. యూ తరఫున నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం సంఘం తరఫున ముందుండి పోరాడుతానని పేర్కొన్నారు. విఠల్‌రెడ్డి ఎన్నిక పట్ల బీబీపేట్ గ్రామస్థులు, ఉపాధ్యాయులు, పి. ఆర్. టీ. యూ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.



# ప్రజా అవసరాలకు ప్రభుత్వ భూములను కేటాయించండి

## - ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌కు

## - కొల్లూరులో స్థానిక అవసరాలకే మిగులు భూమి వినియోగించాలని,

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశం

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.

సోమవారం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూర్ కూడాలి, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ లు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు.స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ తరఫున పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ లు ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని వివరించారు.

### ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు....

ఇస్నాపూర్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### కొల్లూరు భూములు స్థానిక అవసరాలకే

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు.సర్వే నంబర్ 203లో డబుల్



బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొంటూ, ఆ భూమిని ఇతర అవసరాలకు కేటాయించే బదులు స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.

ముఖ్యంగా కొల్లూరులో మోడల్ మార్కెట్ ఏర్పాటు, హిందూముస్లింక్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు వంటి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూమిని వినియోగించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

### అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలి

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై కూడా సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# హత్నూర అధికారుల వేధింపులు ఆపాలి



**- కాసాల వివోఏ ను కొనసాగించాలి**
**- వివో ఏ మాధవి పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి**
**- వివో ఏలకు ప్రభుత్వ హామీని అమలు చేయాలి**
**- యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నగేష్**

**హత్నూర 6 అక్టోబర్ (ప్రజాజ్యోతి)**

మండలంలో సోమవారం నాడు కాసాల వివోఏ పై సిసి వేధింపులు ఆపాలని ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేదలకు సేవలందిస్తున్న వివో ఏను కొనసాగించాలని ప్రభుత్వ హామీలు అమలు చేయాలని ఈరోజు మండల సమైక్య కార్యాలయం ముందు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించి ఏపిఎంకు మెమొరం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం నగేష్ మాట్లాడుతూ 24 సంవత్సరం నుంచి కష్టపడుతున్న వివోయులకు నేటికీ కనీస వేతనం లేదని ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనాలు ఉద్యోగ భద్రత చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు నల్గొండ జిల్లాలో మాధవి పై అన్యాయంగా దాడి చేసిన మాజీ సర్పంచును వెంటనే అరెస్టు చేయాలని కాసాల గ్రామ వి ఓ ఏ ను కొనసాగించాలని,సీసీ వేధింపులు ఆపాలని లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు సిఐటియు మండల నాయకులు షబ్బీర్ శేఖర్ యూనియన్ నాయకులు మంజుల ఆంజనేయులు కిష్టయ్య నరేందర్ గౌడ్ కృష్ణ భాగ్యలక్ష్మి మల్లయ్య ప్రవీణ్ మల్లారెడ్డి విజయ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దు

**హత్నూర 6 అక్టోబర్ (ప్రజా జ్యోతి)**




మండలం కాసాల గ్రామపంచాయతీ 12వ వార్డు పరిధిలోని సోమవారం నాడు చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన డబ్బాల తొలగింపు నోటీసులను ఉపసంహరించుకునేలా తగిన చర్యలు తీసుకొని తమ జీవనోపాధికి అవసరమైన వసతులను రక్షించాలని కోరుతూ సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో చిరు వ్యాపారులు,సంగారెడ్డి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జ్ మిట్టపల్లి రాజేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు వినతిపత్రం అందజేశారు.తమ డబ్బాల వల్ల ఎవరికి ఇబ్బందులు లేకపోయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా తొలగింపు చర్యలకు పాల్పడుతున్నారని వినతి పత్రంలో కలెక్టర్ ను కోరారు. గత పది సంవత్సరాల నుండి ఈ డబ్బాలు పెట్టుకొని జీవనోపాధి జరుగుతుందని వీటిని తొలగిస్తే తమ జీవనోపాధి రోడ్డు పాలవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జి మిట్టపల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఇబ్బందుల గురి చేయడం సరైన పద్ధతి కాదని డబ్బాల తొలగింపు నిర్ణయానికి ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించి ఇతరులకు ఆ చోటు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# సమాచార హక్కు చట్టం

## - వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి..

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత .

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

తెలంగాణ సమాచార కమిషన్ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నేటి (అక్టోబర్ 5) నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం - ఆర్.టి.ఐ వారోత్సవాలు 2026 నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంగీత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం2005పై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలలో సంబంధిత శాఖలు, పబ్లిక్ అథారిటీస్ భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ నెల 9 న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ పి ఐ ఓ లు , పి ఐ ఓ లు , ఫస్టు అప్పీలేట్ అథారిటీ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఆర్టీఐ వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు .

# మల్కాపూర్‌లో తాగునీటి కష్టాలు



- 3, 4వ వార్డుల్లో తీవ్ర ఇబ్బందులు..
8 రోజులుగా పనిచేయని బోరు మోటార్లు
- బోరు మోటార్లను మెకానిక్ షెడ్‌కు తరలించకుండా పంచాయతీలోనే పెట్టి కాలయాపన..
- పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆవేదన..

కొండాపూర్ ప్రజా జ్యోతి

మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 3వ, 4వ వార్డుల్లో బోరు మోటార్లు పనిచేయకపోవడంతో ఆయా వార్డుల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.దాదాపు 8,9 రోజులు గడుస్తున్నా చెడిపోయిన బోరు మోటార్లను ఇప్పటివరకు బాగు చేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. అసలే వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో నీటి లభ్యత తగ్గుతున్న సమయంలో బోరు మోటార్లు కూడా పనిచేయకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేసిందన్నారు.చెడిపోయిన బోరు మోటార్లను వెంటనే మెకానిక్ షెడ్‌కు తీసుకువెళ్లి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు, వాటిని గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఉంచి కాలయాపన చేస్తున్నారని 3, 4వ వార్డుల ప్రజలు ఆరోపించారు. బోరు మోటార్లు పంచాయతీలోనే ఉన్నప్పటికీ మరమ్మతులు చేయించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు.ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీరు వంటి అత్యవసర సమస్యపై ఇంతకాలం నిర్లక్ష్యం చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే 3, 4వ వార్డుల్లో చెడిపోయిన బోరు మోటార్లను మెకానిక్ షెడ్‌కు తరలించి మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న బాధ్యులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫామ్‌పాండ్ పనులను పరిశీలించిన ఎంపీడీవో . హరి నందన్ రావు

కల్హేర్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:
కల్హేర్ మండలంలోని రైతుల పొలాల్లో చేపడుతున్న ఫామ్‌పాండ్ నిర్మాణ పనులను ఎంపీడీవో హరినాథ్ రావు సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌పాండ్‌ల ద్వారా వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకోవడంతో భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా భూమిలోకి ఇంకేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు .రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పొలాల్లో ఫామ్‌పాండ్‌లను నిర్మించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏపీఎం గురుపాదం, టీఏ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్, రైతులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు హెటిరో పరిశ్రమ చేయూత
## సి ఎస్ ర్ నిధులతో స్కూల్ బ్యాగులు, షూస్, నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ

జిన్నారం(ప్రజాజ్యోతి)



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు హెటిరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తున్న సహకారం అభినందనీయమని జిన్నారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం జిన్నారం ఉన్నత పాఠశాలలో హెటిరో గ్రూప్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు హెటిరో పరిశ్రమ అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ అనేక సంవత్సరాలుగా వివిధ కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, ఆట వస్తువులు తదితర సామగ్రిని అందిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమన్నారు.పరిశ్రమ హెచ్ఆర్ భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ తరఫున నిరంతరం సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అందిస్తున్న సామగ్రిని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని, ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ఉపాధ్యాయ బృందం హెటిరో గ్రూప్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్ యాదవ్, పూదూరు సుధాకర్, ఏర్పుల వీరేశం, నాగారం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ కుంటను పరిశీలించిన 7వ వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి

**నారాయణఖేడ్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:**

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నారాయణఖేడ్ పురపాలక సంఘం 7వ వార్డులోని బతుకమ్మ కుంటను వార్డు కౌన్సిలర్ విజయ్ బుజ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ





సందర్భంగా మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కుంటను పూర్తిస్థాయిలో శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాల్లో ఉన్న ముండ్ల పొదలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పండుగకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజల సౌకర్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

# నారాయణఖేడ్‌లో ఘనంగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

8న

**నారాయణఖేడ్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ పట్టణ శివారులోని ఆస్థాన-ఏ-చిస్తీయా, చిస్తీ నగర్‌లో హజ్రత్ ఖ్వాజా షా సయ్యద్ మొహమ్మద్ అహ్మద్ ఖాన్ చిస్తీ సబ్జ్ పోష్ ఖిబ్లా రహెమతుల్లాహి అలైహి వారి వార్షిక ఉర్సే షరీఫ్ ఉత్సవాలను ఈ నెల 8వ తేదీ అనగా గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మొహమ్మద్ మజహర్ ఖాన్ చిస్తీ, మొహమ్మద్ అజహర్ ఖాన్ చిస్తీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ రాత్రి 8 గంటలకు అన్నదానం, రాత్రి 10 గంటలకు ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 9వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు సందల్,గంధాల కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల తర్వాత ఫాతేహా, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు భక్తులు, మత పెద్దలు, పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.





# కారు బైక్‌ను ఢీకొని యువకుడు మృతి

**నారాయణఖేడ్, అక్టోబరు 5, ప్రజాజ్యోతి:**

హైదరాబాద్‌అకోలా జాతీయ రహదారి 161పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన సంఘటన నిజాంపేట్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటకు చెందిన సూర్ణభానుప్రసాద్ (25) సోమవారం బైక్‌పై పెద్దశంకరంపేట వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భానుప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే భానుప్రసాద్ మృతి చెందాడు. భానుప్రసాద్‌కు ఆరు నెలల క్రితమే వివాహం జరిగినట్లు తెలిపారు. యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.








# ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ..

# అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు

**వట్‌పల్లి, అక్టోబర్ 05, (ప్రజాజ్యోతి):**

పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు వట్‌పల్లి పోలీసులు శుభవార్త అందించారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.వట్‌పల్లి మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ఆసక్తి గల నిరుద్యోగ విద్యార్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అక్టోబర్ 3 నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందించనున్నారు.ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఈ అవకాశం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రభుత్వ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో శిక్షణ పొందాలని వట్‌పల్లి పోలీసులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునే అవకాశం ఇదని, అర్హులైన ప్రతి అభ్యర్థి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన తహసీల్దార్ అశోక్..

## విద్యార్థుల చదువులు, వసతి సౌకర్యాలపై ఆరా..

## పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచన...



**కొండాపూర్ ప్రజా జ్యోతి**



కొండాపూర్ మండల పరిధిలోని తోగర్‌పల్లి గ్రామంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వారి విద్యాభ్యాసం, వసతి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహ వార్డెన్ విధుల్లో ఉన్నట్లు గుర్తించారు.అనంతరం తహసీల్దార్ అశోక్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఎస్.ఎ-1 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుకోవడంతో పాటు ఉపాధ్యాయులు సూచించే అంశాలను శ్రద్ధగా నేర్చుకోవాలని తెలిపారు.ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధమై మంచి ఫలితాలు సాధించేలా కష్టపడి చదవాలని తహసీల్దార్ అశోక్ సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు అందేలా సంబంధిత సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# కల్హేర్ ప్రజావాణికి దరఖాస్తులు నిల్

## - ప్రజలు సమస్యలను ప్రజావాణి ద్వారా తెలియజేయాలి: ఎంపీడీవో హరినందనరావు




**కల్హేర్, అక్టోబర్ 5, ప్రజాజ్యోతి:**

కల్హేర్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఒక్క దరఖాస్తు, ఫిర్యాదు కూడా అందలేదని ఎంపీడీవో హరినందనరావు తెలిపారు. నిర్ణీత సమయం వరకు అధికారులు వేచి చూసినా ఎలాంటి అర్జీలు రాలేదని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సూచించారు. వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందకపోవడం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, వీధిలైట్లు, మురుగు కాలువల నిర్వహణ వంటి సమస్యలను ప్రజావాణిలో తెలియజేయవచ్చన్నారు.అలాగే వికలాంగులు, ఒంటరి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పవన్, ఎంఈవో సురేష్. వ్యవసాయ అధికారి. ప్రభుత్వ ఆయా శాఖలకు సంబంధించిన తదితరులు పాల్గొన్నారు.